క్లుప్తంగా

ముగిసిన జియారత్ వేడుకలు


ఆల్వకొండలో పీర్లను ఊరిగేస్తున్న భక్తులు

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ, గిద్దలూరు గ్రామాల్లో దస్తగిరి స్వామి, మౌలాలి స్వామి జియారత్ వేడుకలు శనివారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధ రాత్రి పీర్ల ఊరేగింపు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పీర్లను ఊరేగింపుగా భక్తుల ఇళ్ల దగ్గరకు తీసుకెళ్లి ఆశీస్సులు అందించారు. భక్తులు దస్తగిరి స్వామి, మౌలాలి స్వామివార్లకు ఫాతేహాలు సమర్పించి ముక్కులు చెల్లించుకున్నారు. శనివారం పీర్ల ఊరేగింపు అనంతరం ఆయా చావిళ్లలో కొలువుతీరడంతో జియారత్ వేడుకలు ముగిశాయి.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసిన ఉపాధ్యాయులు

డోన్: పర్యావరణ సమతుల్యం కోసం పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడం అలవర్చుకోవాలని సరస్వతి శిశుమందిర్ హెచ్ఎం సురేఖ అన్నారు. స్థానిక పాతపేటలోని శిశుమందిర్‌లో శనివారం విద్యార్థులతో మొక్కలు నాటించారు. విద్యార్థులకు మొక్కల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన కార్యదర్శి హరిప్రకాష్, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, బొగ్గరపు నటరాజ్, ఉషాలత, రాజేశ్వరమ్మ, శాంతి, పావని పాల్గొన్నారు.

పూరాతన ఆలయాల అభివృద్ధికి కృషి


సిద్ధేశ్వరస్వామి ఆలయ ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న సభ్యులు

బేతంచెర్ల: ఆధ్యాత్మిక నిలయాలైన పూరాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మన ఊరు–మన గుడి సభ్యులు తెలిపారు. శనివారం పట్టణంలోని దుర్గాపేట కాలనీలోని సిద్ధేశ్వరస్వామి ఆలయ ఆవరణను శుభ్రం చేయడానికి మన ఊరు– మన గుడి సభ్యులతో పాటు శివమాలధారులు, భవాని మాలధారులు ముందుకు వచ్చారు. అలాగే నగర పంచాయతీ అధికారులు జేసీబీతో ఆలయ ఆవరణను చదును చేయించారు.

ఆలయాభివృద్ధికి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి అనంతపురం పట్టణానికి చెందిన లింగారెడ్డి షణ్ముఖరెడ్డి, శ్వేత దంపతులు రూ.25వేల విరాళాన్ని అందజేసినట్లు ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్ రెడ్డి శనివారం తెలిపారు. ఈ మేరకు దాతలను పూలమాల, దుశ్శాలువాతో సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదం అందజేశారు.

ప్రారంభానికి ముస్తాబు


నిర్మాణం పూర్తయిన ఫంక్షన్ హాల్

కొలిమిగుండ్ల: స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలో మండల ప్రజల సౌకర్యార్థం రామ్‌కో సిమెంట్ కంపెనీ నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ ప్రారంభానికి ముస్తాబవుతోంది. ఈ నెలలోనే ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ఎమ్మెల్యేగా ఉన్న కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని స్థానికంగా ఫంక్షన్ హాల్ లేక చుట్టుపక్కల పట్టణాలకు వెళ్లి వివాహాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని కొలిమిగుండ్లలో అన్ని సౌకర్యాలతో ఫంక్షన్ హాల్ నిర్మించాలని రామ్‌కో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. యాజమాన్యం స్పందించి భూమి కేటాయిస్తే రూ.4 కోట్లతో హాల్ నిర్మిస్తామని ముందుకొచ్చింది. కస్తూర్బా పాఠశాల సమీపంలోని 544–డీ జాతీయ రహదారి పక్కలో ఉన్న 765/6 సర్వే నంబర్‌లోని 1.60 ఎకరాల ప్రభుత్వ భూమిని ఫంక్షన్ హాల్‌కు మంజూరు చేయాలని అప్పటి కలెక్టర్ మనజీర్ జిలానీని కాటసాని, జెడ్పీచైర్మన్ కోరడంతో కేటాయించారు. ఆ తర్వాత భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఫంక్షన్ హాల్‌లో వివాహాలు జరుపుకునేందుకు వేదికతో పాటు డైనింగ్ హాల్, నీటి సౌకర్యం, టాయ్‌లెట్లు, విశాలమైన పార్కింగ్ ఏర్పాటు చేసి చుట్టు ప్రహరీ నిర్మించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తి కావడంతో అందంగా ముస్తాబైంది.

పశువైద్యం..అందని దైన్యం

పశువైద్యశాలలు అలంకారప్రాయంగా మారుతున్నాయి. ప్యాపిలి మండలంలో నాలుగు వెటర్నరి డిస్పెన్సరీలు ఉన్నా... ఒక్క డాక్టరు కనిపించడం లేదు! పశువులు వ్యాధులతో కొట్టుమిట్టాడుతున్నా... వైద్యం అందే పరిస్థితి లేదు. ఈ ప్రాంతంలో చాలా మంది పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే పశువులకు వైద్య సేవలు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగుల బదిలీల తర్వాత ఖాళీగా ఉన్న పోస్టులకు కొత్తగా ఎవరినీ నియమించక పోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పశువైద్యులు లేక స్తంభించిన సేవలు
- బదిలీ అయిన స్థానాల్లో కొత్తవారిని నియమించని వైనం
- ఆందోళన చెందుతున్న పశుపోషకులు


హుసేనాపురం పశువైద్యశాల


జలదుర్గం పశువైద్యశాల

ప్యాపిలి: ప్రభుత్వం పశుపోషకులపై చిన్నచూపు చూస్తోంది. గ్రామాల్లో పశువైద్యులతో పాటు పలు పోస్టులు ఖాళీగా ఉండడంతో పశువైద్యశాలలు అలంకార ప్రాయంగా మారాయి. వ్యాధులు, ప్రమాదాల బారిన పడిన పశువులకు సకాలంలో చికిత్స అందక అవి ప్రాణాలు వదులుతున్నాయి. స్పందించాల్సిన ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్యాపిలి మండలంలో రాచర్ల, జలదుర్గం, హుసేనాపురం, చిన్నపొదిళ్ల గ్రామాల్లో వెటర్నరి డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటిలో పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు ఇటీవల జరిగిన బదిలీల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. అయితే ఇక్కడి డిస్పెన్సరీలకు మాత్రం బదిలీల్లో ఎవరూ రాకపోవడంతో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో డిస్పెన్సరీలు ఉన్నా వాటిలో సిబ్బంది లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి.

వైద్య సిబ్బంది లేక అందని చికిత్స

ప్యాపిలి మండలంలో ఎద్దులు, ఆవులు 15,195, గేదెలు, ఎనుములు 9,942, గొర్రెలు 1,30,678, మేకలు 29,178 ఉన్నాయి. మండల పరిధిలోని అన్ని గ్రామాలకు కలిపి నాలుగు వెటర్నరి డిస్పెన్సరీలు ఉన్నాయి. ఈ డిస్పెన్సరీలకు కొత్తగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లను ప్రభుత్వం నియమించలేదు. డోన్ మండలం కొత్తపల్లి అసిస్టెంట్ సర్జన్‌కు హుసేనాపురం, జలదుర్గం, చిన్నపొదిళ్ల డిస్పెన్సరీలకు ఇన్‌చార్జ్‌గా నియమించారు. కొచ్చెర్వు అసిస్టెంట్ సర్జన్‌కు రాచర్ల ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఇన్‌చార్జీలకు వారు పనిచేసే డిస్పెన్సరిలో నిర్వహించే విధుల భారంతోనే సతమతం అవుతున్నారు. ఇది చాలదన్నట్లు వారిని ఇన్‌చార్జ్‌గా నియమించడంతో ఇక్కడి డిస్పెన్సరీలకు హాజరు కాలేకపోతున్నారు. అత్యవసర సమయంలో పశువులకు వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి.

ఆర్ఎస్‌కేలలోనూ సిబ్బంది కొరత

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల్లో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో వ్యవసాయంతో పాటు దాని అనుబంధ సేవలను కూడా అప్పటి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. పశువులకు వైద్య చికిత్సలు అందించేందుకు రైతు భరసా కేంద్రాల్లో వెటర్నరి అస్సెండరీ అసిస్టెంట్‌లను నియమించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రానలు రైతు సేవా కేంద్రాలుగా మార్చింది.

ఖాళీలు భర్తీ కావాల్సి ఉంది



ప్యాపిలి మండలంలోని నాలుగు డిస్పెన్సరీలలో పనిచేస్తున్న వెటర్నరి అసిస్టెంట్ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీలు భర్తీ కాకపోవడంతో డోన్ మండలంలో పనిచేస్తున్న ఇద్దరు అసిస్టెంట్ సర్జన్‌లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాం. స్థానికంగా నెలకొన్న సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. –విక్టర్, ఏడీ, పశుసంవర్థకశాఖ

పశువైద్యులను నియమించాలి



గ్రామాల్లో రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. పశువులకు అత్యవసరంగా వైద్య చికిత్స కావాల్సి వస్తే సమీపంలో ఉన్న పశువైద్యశాలకు తీసుకొస్తారు. హుసేనాపురం గ్రామానికి నలువైపులా దాదాపు 10 కిలోమీటర్లలోపు దాదాపు 20 గ్రామాలు ఉన్నాయి. పశుపోషకులు తమ పశువులను హుసేనాపురం పశువైద్యశాలకు తీసుకొచ్చి గంటల తరబడి నిరీక్షించి వెనక్కు వెళ్తున్నారు. పలు సందర్భాల్లో పశువులు మృత్యువాత పడుతున్నాయి. దీంతో పశుపోషకులు తీవ్రంగా నష్టపోతున్నారు. –మహేశ్వర్ రెడ్డి, సర్పంచ్

ఎవరికి ఫోన్ చేయాలో తెలియదు



అత్యవసర సమయాల్లో పశువులకు వైద్య చికిత్స అవసరమైనప్పుడు పశువైద్యశాల సిబ్బంది గ్రామాలకు వచ్చి వైద్యం అందించాలి. వైద్యాధికారులు, సిబ్బంది లేకపోవడంతో ఇన్‌చార్జి అధికారులు ఎప్పుడు ఉంటారో తెలియదు. వారు వచ్చేలోపు పశువులు మృతి చెందుతున్నాయి. ఇలాంటి సమయంలో ఎవరికి ఫోన్ చేయాలో కూడా తెలియదు. అధికారులు పశువైద్యశాలల్లో సిబ్బందిని అందుబాటులో ఉంచాలి. అత్యవసర సమయాల్లో గ్రామాలకు వెళ్లే ఏర్పాటు చేయాలి. –పాల శ్రీనివాసులు, మామిళ్లపల్లి

నాబార్డ్ వ్యవస్థాపక దినోత్సవం


మొక్కలు నాటుతున్న ఉద్యోగులు

ప్యాపిలి: కలచట్ల గ్రామంలో వాటర్‌షెడ్ కమిటీ, సొసైటీ ఫర్ రూరల్ అండ్ ఎకో డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నాబార్డ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. సర్పంచ్ రమాదేవి మాట్లాడుతూ.. నాబార్డ్ ద్వారా కలచట్ల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. గ్రామీణ రైతులకు నాబార్డ్ ఆర్థికసాయం చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి పాటుపడుతోందన్నారు. గ్రామంలో ఆర్‌ఓ ప్లాంట్, ట్యాంకర్, వ్యవసాయ పనిముట్ల పంపిణీ తదితర కార్యక్రమాలు జరిగాయన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రామ్మూర్తి, వాటర్‌షెడ్ ట్రెజరర్ రవి, ఇంజినీర్ రాకేశ్‌వర్మ, మేనేజర్ సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్ ఈశ్వర్, రైతులు పుల్లయ్య, పెద్దయ్య, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

డోన్ టౌన్: ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటాలు చేస్తూనే ఉంటుందని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి మోటా రాముడు, ఏఐవైఎఫ్ నాయకుడు రణత్ యాదవ్ తెలిపారు. ఈ నెల 30,31 తేదీల్లో నంద్యాల జిల్లా సీపీఐ మహాసభలకు ప్రోత్సాహం కల్పించేందుకు శనివారం పట్టణంలోని పలు కాలనీల్లో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి నేతలు ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలంటూ హామీలు ఇచ్చి మోసం చేశారని.. ఇప్పుడు వాటిని అమలు చేయకుండా పీ–4 అంటూ మాట మార్చుతున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మహాసభల్లో చర్చించి, భవిష్యత్తు ఉద్యమాలకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

స్మార్ట్ మీటర్ల విషయంలో ప్రజలే నిలదీయాలి


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ప్యాపిలి: ప్రభుత్వం అడ్డదిడ్డంగా ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపుతోందని సీపీఎం నాయకుడు చిన్న రహిమాన్ విమర్శించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇప్పటికే వ్యాపార సముదాయాలకు స్మార్ట్ మీటర్లు బిగించిన ప్రభుత్వం 200 యూనిట్లు పైబడి విద్యుత్‌ను వినియోగిస్తున్న వారి ఇళ్లకు కూడా స్మార్ట్ మీటర్ బిగించే ఏర్పాట్లు చేస్తోందన్నారు. మీటర్లు బిగించడానికి వచ్చిన విద్యుత్ అధికారులను ప్రజలే నిలదీయాలన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేశ్ స్మార్ట్ మీటర్లను పగులగొట్టండి అని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలో ఉన్న ఆయనే కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం స్మార్ట్ మీటర్ల విషయంలో నోరు మెదపడం లేదన్నారు. సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, రామాంజనేయులు, రంగస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.


కొత్తగా ఏర్పాటవుతున్న బంకులు


నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

‘కొత్త’ కష్టాలు

డోన్ టౌన్: ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు, ప్రజల వినతులు, సంఘాల ఆందోళనలు అన్నింటినీ పక్కన పెట్టి పట్టణ మధ్యలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అధికారులు పట్టణ శివార్లకు తరలించడంతో వ్యాపారులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు.

కార్యాలయాన్ని ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్న డాక్యుమెంటు రైటర్లు, జిరాక్స్ షాపులు, స్టాంప్ వెండర్లు, ఆన్‌లైన్ సెంటర్లు పట్టణ శివార్లలోని కార్యాలయం వైపు బలవంతంగా తరలిపోతున్నారు. అక్కడ స్థల యజమానులు ‘చూపిందే స్థలం, చెప్పిందే ధర’ అనే విధంగా అడ్వాన్సులు డిమాండ్ చేస్తూ బంకులు ఏర్పాటు చేసుకోవాలని ఒత్తిడి పెడుతున్నారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భద్రతపై ఆందోళన

పట్టణ శివార్లలో ఏర్పాటైన బంకుల్లో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, జిరాక్స్, ప్రింటింగ్ మిషన్లకు భద్రత లేకుండా పోయింది. రాత్రివేళల్లో దొంగతనాలు జరిగే అవకాశం ఉండడంతో వ్యాపారుల్లో అభద్రతా భావం నెలకొంది.

రూ.20 వేలు అడ్వాన్సుతో స్థలం!

నూతన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని ఖాళీ స్థలాల్లో రూ.20 వేలు అడ్వాన్సు చెల్లిస్తే బంకులు ఏర్పాటు చేసుకోవచ్చని ఓ టీడీపీ నేత వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. అంతేకాక, నూతన షాపులకు ఇంటర్నెట్ కనెక్షన్లు కూడా ఒక ప్రైవేట్ కంపెనీ ద్వారా మాత్రమే ఏర్పాటు చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రజా సంఘాల నిరసన వృథా

కార్యాలయం తరలింపును వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులతో పాటు డాక్యుమెంటు రైటర్లు పెన్‌డౌన్ కార్యక్రమాలు, రిలే నిరాహార దీక్షలు చేపట్టినప్పటికీ అధికార యంత్రాంగం స్పందించకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కొందరి స్వప్రయోజనాల కోసమే కార్యాలయాన్ని తరలించారన్న అభిప్రాయం బలపడుతోంది.


షాపులను తొలగించి తరలిస్తున్న వ్యాపారులు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

బనగానపల్లెలో బీసీజేఆర్ ట్యాక్స్..!

- అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమ వసూళ్లు
- మంత్రి బీసీపై మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆరోపణలు

బనగానపల్లె: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బనగానపల్లె నియోజకవర్గంలో బీసీజేఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆరోపించారు. పట్టణంలోని ధనలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో శనివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల కన్వీనర్లు, సభ్యులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ అనే క్యూఆర్ కోడ్ ఉండే పోస్టర్లను ఆవిష్కరించారు. కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ.. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పట్టణంలోని ఫంక్షన్ హాల్ యజమాని వేణుగోపాల్ శెట్టి నుంచి రూ.1.50 కోట్లు, క్రషర్ యాజమానుల నుంచి రూ.3 కోట్లతో పాటు డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్ నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపించారు. వసూలు చేసిన నగదు గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మంత్రి బీసీ తన అనుచరుల ద్వారా టన్ను ఇసుకపై రూ.250 అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన 22 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు 200 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించినట్లు పేర్కొన్నారు. కేసులకు వైఎస్సార్‌సీపీ నాయకులు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటి వరకు తన సోదరుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాణ్యం నుంచి ఆరుమార్లు, తాను రెండుసార్లు ఎమ్మెల్యేలుగా గెలుపొందామని..ఎన్నడూ అక్రమ వసూళ్లు చేయడం గానీ, అక్రమ కేసులు బనాయించడం కానీ చేయలేదన్నారు. టీడీపీ నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులను క్షమించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. కూటమి పాలనలో రైతులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు నష్టపోతున్నారని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో నియోజకవర్గంలో రూ.1,700 కోట్లతో సంక్షేమ పథకాలు, రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులకు ఖర్చు చేసినట్లు తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కాటసాని ఓబులరెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ సీఎంగా తిరిగి అధికారంలోకి వస్తారని, కాటసాని రామిరెడ్డి ఎమ్మెల్యేగా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. తమపై వేసిన అక్రమ కేసులకు వడ్డీతో సహా ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించారు. కాటసాని కుటుంబం నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీనివాసనాయక్, అత్తార్ జావేద్‌హుస్సేన్, చిన్నబాబు, అనిల్, జనార్దన్‌రెడ్డి, అంబటి రవి కుమార్‌రెడ్డి, సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15న యాగంటిలో బహిరంగవేలం

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్ర పరిధిలో ఐస్‌క్రీం, పండ్లు, బొమ్మలు, రుద్రాక్షధారాలు, రుద్రాక్షమాలలు, కరుంగలి మాలలు, పూసల మాలలు, రాగికడియాల విక్రయానికి హక్కుల కోసం ఈ నెల 15న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పాండురంగారెడ్డి శనివారం తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు అవసరమైన డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సూచించారు. మరిన్ని వివరాల కోసం ఆలయ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఈవో పేర్కొన్నారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామ వేధింపులకు గురిచేస్తున్నారని కోడలు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. వివరాలు.. పట్టణంలోని ఆసర్‌పేట కాలనీకి చెందిన షేక్ నజ్రీన్‌కు బేతంచెర్ల మండలం రంగాపురం గ్రామానికి చెందిన ఇద్రూస్ వలితో 2 నెలల క్రితం వివాహం జరిగింది. అయితే కొద్ది రోజులుగా భర్త ఇద్రూస్ వలి, మామ ఇద్రూస్ బాషా, అత్త మౌలాబీ అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని కోడలు షేక్ నజ్రీన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలోని యాగశాలలో శనివారం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, హనుమంతుశర్మ ఆధ్వర్యంలో భక్తులు రుద్ర, చండీ హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, రుద్ర, చండీ, మహా మృత్యుంజయ హోమాలు చేసుకున్నారు.

- ఆషాడమాసం పురస్కరించుకుని నంద్యాల, మహానంది గ్రామాలకు చెందిన ఆర్యవైశ్య మహిళలు మహానందిలో కామేశ్వరీదేవి అమ్మవారికి చీర, సారె సమర్పించారు.

కేసు నమోదు

బండి ఆత్మకూరు: అజాగ్రత్తగా మోటార్ సైకిల్ నడుపుతూ ఇద్దరు గాయపడటానికి కారణమైన వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. పార్నపల్లి గ్రామానికి చెందిన వికలాంగుడు దుద్దుకూరి సుంకన్న కాకునూరు రోడ్డులోని తెలుగుగంగ పిల్లకాలువ వద్ద తన కొడుకుతో కలిసి ట్రైసైకిల్‌పై వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన వడ్డే శ్రీకాంత్ బైక్‌తో ఢీకొట్టడంతో తండ్రీ, కుమారుడు గాయపడ్డారన్నారు. బాధితుడు సుంకన్న ఫిర్యాదు మేరకు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

అక్రమ కేసులకు భయపడం

- వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి


బనగానపల్లెలో విస్తృత స్థాయి సమావేశానికి వెళ్తున్న చల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు


ఆకుమల్ల నుంచి తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అవుకు: కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అక్రమ కేసులతో వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఇబ్బందులు పెడుతున్నారని, ఇలాంటి కేసులకు భయపడేదిలేదని వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి అన్నారు. చల్లా కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల తనతో పాటు అనుచరులపై అక్రమ కేసులు బనాయించారని మండిపడ్డారు. ప్రజలు అన్ని చూస్తున్నారని, రాబోయే కాలంలో ప్రజలే వీటికి ఓటుతో బదులిస్తారని తెలిపారు. అనంతరం తన అనుచరులతో కలిసి బనగానపల్లె పట్టణంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశానికి తరలివెళ్లారు.

సంజామల నుంచి తరలివెళ్లిన నాయకులు

సంజామల: బనగానపల్లెలో జరిగిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశానికి మండలం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

గోల్డ్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని వినతి

డోన్ టౌన్: తుగ్గలి మండలంలోని జొన్నగిరి, బొల్లవానిపల్లె, పగిడిరాయి గ్రామాల రైతులకు అన్యాయం చేస్తున్న జియో మైసూర్ ప్రైవేట్ లిమిటెడ్ గోల్డ్ మైనింగ్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తకాపు హేమ సుందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం అనంతపురం జిల్లా గుంతకల్లులో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసశర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయా గ్రామాల్లో భూములు ఇస్తే పిల్లలకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని నమ్మించి రైతుల నుంచి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి ఇప్పుడు మోహం చాటేస్తున్న కంపెనీపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ఆవరణ

మద్దిలేటి స్వామికి విశేష పూజలు

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆషాడ మాసం శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వేకువజామున ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి, వరపూజ నిర్వహించి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.